
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



దళారులే ధర సైంధవులు

దళారుల మాయాజాలంతో ఉప్పుకు గిట్టుబాటు ధరలు దక్కక రైతులు నష్టపోతున్నారు. దీనికితోడు ఈ ఏడాది ప్రకృతి అనుకూలించక దిగుబడి పడిపోయింది.

- 8లో..



బరితెగించిన తెలుగు తమ్ముళ్లు

తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. మట్టి కోసం ఏకంగా నేతివారికుంట కట్టను ధ్వంసం చేశారు. గ్రామస్తులు, అధికారులు స్పందించి అడ్డుకున్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 36/27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని ఒకటీరెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోస్టల్ అండ్ పెన్షనర్ల అసోసియేషన్ నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

ఒంగోలు వన్‌టౌన్: ఆలిండియా పోస్టల్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని హెడ్‌పోస్టాఫీసు ఎదురుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన వారి హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధివిధానాలు రూపొందిస్తోందన్నారు. ప్రస్తుతం–భవిష్యత్తులో ఉద్యోగ విరమణ చేసిన వారి మధ్య వివక్షత లేకుండా న్యాయం చేయాలన్నారు. అన్ని పెన్షన్‌దారులకు 8వ వేతన కమిషన్ ప్రయోజనాలను సమానంగా పొడిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌క్యూ ఉపాధ్యక్షుడు డి.మోహనరావు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, కె.వీరాస్వామిరెడ్డి, పి.పేరయ్య, టి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి

ఒంగోలు సబర్బన్: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, అంబేడ్కర్ భవనానికి వెళ్లేదారిలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ భవనంలో సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంఘ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సాయమందక.. సాగు కదలక!

నాడు వ్యవసాయం దండగన్నాడు..
నేడు ఆ మాటను కొనసాగిస్తున్నట్లుగా పరిపాలన సాగిస్తున్నాడు.
రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడు సీఎం చంద్రబాబు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు దాటుతున్నా అన్నదాతల కనీస అవసరాలపై కాస్త కూడా దృష్టి సారించిన పాపానపోలేదు. పథకాలేమీ అమలు చేయకపోగా, చివరకు పంట నష్టపరిహారానికి కూడా పాతరేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం చెల్లించకుండా పరిహాసమాడుతున్నారు. రైతుల కష్టనష్టాలు, వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో అన్నదాతల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

- రైతులకు పంట నష్టపరిహారం చెల్లించకుండా చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- రెండు పంట సీజన్లు దాటినా అందని పరిహారం
- గతేడాది ఖరీఫ్ నుంచి ఎదురుచూస్తున్న రైతాంగం
- మార్కాపురం డివిజన్లోనే 5,940 మంది రైతులకు రూ.4.65 కోట్లు అందాల్సిన వైనం
- వ్యవసాయానికి సాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం
- అన్నదాతల్లో తీవ్ర నైరాశ్యం
- కనీవినీ ఎరుగని రీతిలో పథకాలు అందించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

మార్కాపురం: జిల్లాలో 2024–25 సంవత్సరంలో ఖరీఫ్ సాగు లక్ష్యం 2,02,249 హెక్టార్లు. సుమారు 1.7 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. రబీ సీజన్‌లో సాధారణంగా 3,97,880 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయాల్సి ఉంది. అయితే, కేవలం 2,99,331 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వేసిన పంటల్లో కూడా దాదాపు లక్షకు పైగా ఎకరాల్లో నిలువునా ఎండిపోయాయి. మిగతా 1.99 లక్షల ఎకరాల్లో కూడా సగానికిపైగా ఎకరాల్లో దిగుబడి మరీ దారుణంగా పడిపోయింది. దీంతో రైతన్న పరిస్థితి దయనీయంగా మారింది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతకముందు ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో కురిసిన వర్షాలకు సైతం పంటనష్టం భారీగా ఉంది. గతేడాది ఖరీఫ్ నుంచి పరిహారం కోసం అన్నదాతలు ఎదురుచూస్తూనే ఉన్నారు.

నేడు కూటమి ప్రభుత్వంలో...

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటుతున్నా నేటికీ ఏ ఒక్క రైతుకూ ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం అందలేదు. దీంతో రైతులంతా పెట్టుబడుల కోసం 2019కి పూర్వం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించినట్లుగా మళ్లీ వారి వద్దకే వెళ్తున్నారు. ఈ ఏడాది కేవలం పీఎం కిసాన్ నిధి కింద మాత్రమే రైతులకు రూ.2 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. చివరకు గతేడాది రెండు సీజన్లకు సంబంధించిన పంట నష్టపరిహారం కూడా ఎగ్గొట్టడంతో కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతలు తీవ్రస్థాయిలో అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో రైతులు తీవ్రంగా పంట నష్టపోయారు. కానీ, నేటికీ కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు నష్టపరిహారం అందలేదు. వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రబీ పంటలకు నష్టపరిహారం ఎప్పుడో..?

2023–24 రబీ సీజన్‌లో మార్కాపురం డివిజన్‌లో మిర్చి, పత్తి, అపరాలు, తదితర పంటలను రైతులు అధికంగా సాగుచేశారు. 2023 నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పొలాల్లో నీళ్లు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మిర్చి పంటలకు ఊహించని తెగుళ్లు వచ్చి దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులు వేలాది రూపాయలు కూడా ఖర్చు చేశారు. కానీ, ఫలితం దక్కలేదు. ముఖ్యంగా మినుము, కంది, సజ్జ, పొద్దు తిరుగుడు, ఆముదం, నూగు, జొన్న తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే, గతేడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతేడాది జూన్ 20 వ తేదీ కేంద్ర కరువు బృందం మార్కాపురం ప్రాంతంలో పర్యటించింది. ఈ బృందంలో ఎంఅండ్‌ఏ డైరెక్టర్ మన్నూజీ ఉపాధ్యాయ, కేంద్ర పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఈ కశ్యప్, న్యూఢిల్లీకి చెందిన ఫుడ్ అండ్ పబ్లిక్ డిపార్ట్‌మెంటు డిప్యూటీ డైరెక్టర్ మదన్‌మోహన్ మౌర్య, నీతిఆయోగ్ సీనియర్ రిసెర్చ్ ఆఫీసర్ అనూరాధ బట్నాతో పాటు జిల్లా అధికారులు, స్థానిక అధికారులు ఉన్నారు. ముందుగా వేములకోట చెరువును పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక పంపారు. కానీ, నేటికీ రైతులకు పంట నష్టపరిహారం మాత్రం అందలేదు.



రైతులకు పంట నష్టపరిహారం అందించాలి

మార్కాపురం నియోజకవర్గంలో పలు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. కానీ, పంట నష్టపోయిన రైతులకు మాత్రం పరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కరువు ప్రాంతాలుగా ప్రకటించిన దృష్ట్యా గతేడాది రబీలో సాగుచేసి నష్టపోయిన పంటలకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. రైతుల రుణాలు మాఫీ చేయాలి.

– బాలనాగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగింది. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగుచేసుకునేందుకు రైతులకు పెట్టుబడి సాయం అందించారు. ఏ ఒక్క రైతూ పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ప్రతిఏటా పీఎం కిసాన్ నిధితో కలిసి వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 అందించారు. దీంతో రైతులు ఇబ్బంది పడకుండా ఖరీఫ్, రబీ సీజన్లలో పత్తి, మిర్చి, పొగాకు, కంది, సజ్జ, వరి తదితర పంటలు సాగుచేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆర్థికసాయం అందించడంతో పాటు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలన్నీ అమలు చేశారు. ఐదేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు వ్యవసాయం చేసి పంటలు పండించారు.

మార్కాపురం సబ్ డివిజన్‌లో రైతులకు అందాల్సిన పంట నష్టపరిహారం వివరాలు...

మండలం	నష్టపోయిన రైతులు	పంటనష్టం విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులకు అందావాల్సిన పరిహారం (రూపాయల్లో)
మార్కాపురం	1210	1095.44	1,08,08,300
అర్ధవీడు	1087	760.98	74,31,584
పెద్దారవీడు	788	481.41	46,30,900
కంభం	1406	1211.78	1,19,58,987
తర్లుపాడు	1449	1180.97	1,17,24,250
మొత్తం	5940	4730.58	4,65,54,021

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో రైతులకు సాయం ఇలా...

సంవత్సరం	రైతులు	మంజూరైన నగదు (రూ.కోట్లలో)
2019–20	2,30,453	311.11
2020–21	2,61,600	353.24
2021–22	2,74,790	370.97
2022–23	2,86,256	386.45
2023–24	2,84,113	213.08
మొత్తం	13,37,212	1634.85

మాటమీద నిలబడే వ్యక్తి.. వైఎస్ జగన్

- పేదలందరికీ న్యాయం జగనన్నతోనే సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: దేశంలో మాట మీద నిలబడిన ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. దర్శి మండలంలోని శామంతపూడి గ్రామంలో ఆంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ నాయకుడు అమరా మురళి ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభపై ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రభ ఏర్పాటు చేసిన మురళిని బూచేపల్లి అభినందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట మీద నిలబడిన వ్యక్తులు ఇద్దరే ఇద్దరున్నారన్నారు. వారిలో



పాల్గొన్న ప్రజలు



ప్రభపై మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

ఒకరు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాగా, రెండో వ్యక్తి ఆయన కుమారుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. తన తండ్రి ఆశయ సాధనలో భాగంగా పేదలందరికీ న్యాయం చేయడం జగనన్నతోనే సాధ్యమని అన్నారు. జగనన్న పాలనలో పార్టీలు, కులాలు, మతాలు చూడలేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలన్నీ అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. పనులు చేసుకునే ప్రజలు తమ పనులు మానుకుని పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన అవసరం లేకుండా ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్, 2000 మందికి ఒక సచివాలయం, సచివాలయంలో సేవలందించేందుకు 11 మంది ఉద్యోగులను నియమించిన గొప్ప సీఎం అని గుర్తుచేశారు. నేరుగా గడపగడపకు పథకాలు, ప్రభుత్వ సేవలు అందించడం వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు.

కూటమి పాలన చూసి బాధపడుతున్న ప్రజలు...

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలన చూస్తూ జగనన్న లాంటి గొప్ప సీఎంని పోగొట్టుకుని తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని ప్రతి పేదవాడు పరితపిస్తున్నాడన్నారు. జగనన్నకు వృద్ధాప్యం అప్పుడే రాదని, ఆయనకు ఇంకా ఎంతో వయసుందని, మళ్లీ మీ అందరి మద్దతుతో సీఎంగా పేదలందరికీ జగనన్న న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. గత ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన అందరికీ బూచేపల్లి ధన్యవాదాలు తెలిపారు. తమ కుటుంబంపై ప్రేమ, నమ్మకంతో తన తల్లికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, తనకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా జగనన్న అవకాశం కల్పించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని, జగనన్నను సీఎంని చేసుకునేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, సాగర్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, నాయకులు పమిడి కొండయ్య, అమరా వెంకటేశ్వర్లు, దుగ్గిరాల రామస్వామి, అమరా పద్దయ్య, అమరా నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసుల పరిశీలన, నివారణ చర్యలకు జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వ గెజిట్ ప్రకారం జిల్లాలో నూతన కమిటీ ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అనధికార సభ్యులు (నాన్ ఆఫీషియల్ మెంబర్స్) ఖాళీలు 5, ఎస్సీ, ఎస్టీ కాని ఇతర కులాలకు చెందినవారు (ఎన్‌జీఓలు) ఖాళీలు 3 ఉన్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండి ఆసక్తి, సేవాభావం ఉన్నవారు ఇది వరకు చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బయోడేటాతో పాటు విద్యార్హత, కులం, రెసిడెన్సీ, నిరుద్యోగ, సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలు జతచేసి 2025 ఏప్రిల్ 15వ తేదీలోగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని కోరారు.

లక్ష్యాల మేరకు రుణాలివ్వాలి

- ప్రజల అభ్యున్నతికి పాటుపడాలి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: బీసీ, ఈబీసీ, కాపు యాక్షన్ ప్లాన్ కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ కార్పొరేషన్, ఇతర కార్పొరేషన్ల అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందించాలని బ్యాంకర్లను కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన వివిధ యూనిట్ల గ్రౌండింగ్ పురోగతిపై సమీక్షించి పలు సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలో వీరికి సంబంధించి 1,864 యూనిట్ల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్లు గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 11వ తేదీ జరిగే మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి వేడుకల్లో సంబంధిత లబ్ధిదారులకు యూనిట్ల మంజూరు ఉత్తర్వులిచ్చేలా చర్యలు తీసుకోవాలని బీసీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతిబ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం రమేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్రీ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలి

- అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి
- అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ

ఒంగోలు సిటీ: అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించి ప్రీ స్కూళ్ల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల సెక్టార్ లీడర్లు మూడు సంవత్సరాల క్రితం వారికిచ్చిన ఫోన్లు పనిచేయని కారణంగా గురువారం ఒంగోలులోని ఐసీడీఎస్ పీడీ ఆఫీసులో రిటర్న్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నిన్న బీఎస్ 2.0 వర్షన్ యాప్ విడుదల చేసిందని, ఆ యాప్‌లో ఉదయం 9 గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫేస్ రికగ్నైజేషన్ చేయాలనడం ఇబ్బందిగా ఉందని అన్నారు. 11 రకాల రిజిస్టర్ రిపోర్ట్స్ ఆ యాప్‌లో రాయమనడం, ఉదయం 9 గంటలకి ఎంతమంది పిల్లలుంటే అంతమందికే ఫుడ్ పెట్టాలనడంతో అనేక రకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏడు ప్రాజెక్టులు గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయని, అటవీ ప్రాంతంలో ఉన్నాయని, అక్కడ సిగ్నల్స్ ఉండవని తెలిపారు. సిగ్నల్స్ లేకపోతే ఫేస్ రికగ్నైజేషన్ కాదని, దానివలన అంగన్‌వాడీల జీతం కట్ చేసే పరిస్థితి ఉందని అన్నారు. వీటిద్వారా అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పని చేయడానికి తాము వ్యతిరేకం కాదని, 5జీ ట్యాబులిస్తే పనిచేస్తామని తెలిపారు. పనిచేయని ఫోన్లను వెనక్కి ఇచ్చేయమని, సొంత ఫోన్లలో పనిచేయవద్దని కమిషనర్ చెప్పారన్నారు. జిల్లాలో 80 నుంచి 90 శాతం అంగన్‌వాడీలు సొంత ఫోన్లలో పనిచేస్తున్నారన్నారు. ఆఫీస్ ఫోన్లు మా దగ్గర ఉంటే.. అధికారులు సొంత ఫోన్లోనైనా పనిచేయండని చెప్పి బెదిరిస్తున్నారన్నారు. అందుకే ఆఫీస్ ఫోన్లు ఆఫీస్‌కి ఇచ్చామని, ఈ ఫోన్లలో పనిచేయడం సాధ్యమేనా అని నిపుణులతో ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీల సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.రమేష్, సీఐటీయూ జిల్లా నాయకుడు మాలకొండయ్య, అన్ని ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్లు వెనక్కిచ్చి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కనిగిరిలో కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారిన రోడ్డు




బేస్తవారిపేట మండలం జెన్నివారిపల్లెలో విరిగి రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాలు

వేసవిలో చలచల్లగా..

- పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాల్లో వర్షం
- కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు

బేస్తవారిపేట: వేసవి ప్రారంభమై ఎండతీవ్రత, ఉక్కపోత పెరుగుతున్న నేపథ్యంలో గురువారం ఒక్కసారిగా వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో పశ్చిమ ప్రకాశం ప్రజలు సేదతీరారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీయడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు ఎక్కడికక్కడ తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట నేలకొరిగింది. దాదాపు 300 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మూడు రేకుల షెడ్లకు రేకులు ఎగిరి కిందపడ్డాయి.



బేస్తవారిపేట: నేలకొరిగిన మొక్కజొన్న పంట

మార్కాపురంలో వర్షం...

మార్కాపురం/కొనకనమిట్ల: పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో అకస్మాత్తుగా వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. వేసవిలో వర్షం పడటంతో ప్రజలు బయటకు వచ్చి వర్షంలో తడుస్తూ చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. వారం రోజులుగా 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమవుతోంది. సాయంత్రం 6 గంటల వరకూ ఎండ అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వర్షం కురిసి చల్లటి గాలులు వీచాయి. సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురిసింది. అదే సమయంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని పలు గ్రామాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.



హెచ్‌ఎం పాడులో కురుస్తున్న వర్షం

చిత్తడిగా మారిన కనిగిరి రోడ్లు...

కనిగిరి రూరల్/హనుమంతునిపాడు: కనిగిరిలో గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి వాతావరణం పూర్తిగా చల్లబడింది. వర్షం నీటితో పట్టణంలోని ప్రధాన, శివారు ప్రాంతాల్లోని రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కొద్దిపాటి వర్షానికే పట్టణంలోని రోడ్లపై నీళ్లు నిలవడంతో ప్రజలు చీదరించుకుంటున్నారు. హనుమంతునిపాడు మండలంలోనూ చిరుజల్లులు కురిసాయి. మండల కేంద్రంతో పాటు వేములపాడు, గాయంవారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, హాజీపురం, వెంగపల్లి, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు నిమ్మతోటల్లో పిందె, పూత రాలిపోయింది. కోతకోసిన రాగి పంట కూడా కొంత దెబ్బతింటుందని రైతులు తెలిపారు.

క్లుప్తంగా

రైల్వేస్టేషన్లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

ఒంగోలు టౌన్: రైల్వే ప్లాట్ ఫారం మీద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్ ఫారం మీద 60 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మరణించారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో వృద్ధుడు మరణించి ఉండటం గమనించిన ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. లేత ఆకుపచ్చ రంగు చొక్కాపై బులుగు, నలుపు రంగు చారల, నలుపు తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం తెలిసిన వారు ఒంగోలు రైల్వే ఎస్‌ఐ ఫోన్ నెంబర్ 9440627647కు తెలియజేయాలని ఎస్సై అరుణ కుమారి కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టంగుటూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్ర రక్తగాయాలై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు శరీరంపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని 40 ఏళ్ల వయసుంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తిస్తే 9121102137, 9121102135 నంబర్లకు సంప్రదించాలని ఎస్సై నాగమల్లేశ్వర రావు తెలిపారు.

నిందితునికి రెండేళ్ల జైలు

- లారీని నిర్లక్ష్యంగా నడిపి ముగ్గురు మరణానికి కారణమైన కేసులో..

చీమకుర్తి: లారీని నిర్లక్ష్యంగా నడిపి ముగ్గురు మరణానికి కారణమైన లారీ డ్రైవర్ ముత్తు పాండియన్ రంగస్వామికి ఒంగోలు కోర్టు రెండు సంవత్సరాల 3 నెలల జైలుశిక్ష, రూ.5,500 జరిమానా విధించింది. ఒంగోలు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్ కోమలవల్లి గురువారం తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...2019 జూన్ 8న చీమకుర్తిలోని గంగవరం రోడ్డులో ముగ్గురు వ్యక్తులు బైకుపై పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ కొట్టించుకొని వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో చీమకుర్తి క్రిష్టియన్‌పాలెం, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మందా రాకేష్, మట్టిగుంట రాకేష్, ఆత్మకూరి మహేష్ ముగ్గురు మరణించారు. పి.నాగరాజు ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో నిర్లక్ష్యంగా లారీని నడిపి ముగ్గురు మరణానికి కారణమైన లారీ డ్రైవర్‌కు శిక్ష పడటంతో సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

దళారులే.. ధర సైంధవులు!

- దళారుల మాయతో ఉప్పు రైతులకు దక్కని గిట్టుబాటు ధర
- ఈ ఏడాది ప్రకృతి అనుకూలించక సగానికి పడిపోయిన దిగుబడి
- డిమాండ్ ఉన్నా వ్యాపారుల సిండికేట్‌తో సొమ్ము చేసుకోలేని దుస్థితి
- బహిరంగ మార్కెట్లో 75 కేజీల బస్తా రూ.500.. రైతుకిచ్చేది రూ.150
- పరిశ్రమల అవసరాలకు వినియోగించే ఉప్పు క్వింటా రూ.150 మాత్రమే..
- పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని ఉప్పు రైతుల ఆవేదన



కొత్తపట్నం తీరంలో ఉప్పు మడి

కొత్తపట్నం: లాభాలతో కళకళలాడాల్సిన ఉప్పు రైతుల మోము.. దళారుల దోపిడీతో చిన్నబోతోంది. ఉప్పు నాణ్యతను బట్టి గిట్టుబాటు ధర కల్పించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో దళారులదే ఇష్టారాజ్యమైంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లాలో ఈ ఏడాది ఉప్పు దిగుబడి సగానికి సగం పడిపోయిన పరిస్థితుల్లో డిమాండ్ పెరిగింది. ఈ మేరకు రైతులకు దక్కాల్సిన లాభాన్ని దళారులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. బహిరంగ మార్కెట్లో 75 కేజీల బస్తా రూ.500 ఉండగా.. సిండికేట్ అయిన వ్యాపారులు కేవలం రూ.150 ఇచ్చి సరిపెడుతున్నారు. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో చినగంజాం, కనపర్తి, కొత్తపట్నం, మోటుమాల, పాదర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి తీర ప్రాంతాల్లో 7 వేల మందికి పైగా రైతులు సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. ఉప్పు కొటార్లను నమ్ముకుని 10 వేల మందికి పైగా కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలో ఏటా 20 వేల టన్నుల ఉప్పు ఉత్పత్తి అవుతుండగా స్థానిక అవసరాలకుపోను తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో వాతావరణం అనుకూలించి లాభాలు చవిచూసిన రైతులకు ఈ ఏడాది కష్టాలు ఎదురయ్యాయి. ప్రకృతి ప్రకోపించడంతోపాటు దళారులు దోపిడీ చేస్తుండటంతో ఉప్పు రైతులు విలవిల్లాడుతున్నారు.

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 75 కేజీల బస్తా ధర సుమారు రూ.500 పలుకుతుండగా.. అదే సమయంలో రైతుకు దక్కుతోంది రూ.150 మాత్రమే. సబ్బులు, బ్లీచింగ్, తోళ్ల పరిశ్రమ, ఇతర కెమికల్ ఫ్యాక్టరీల్లో వినియోగించే ఉప్పు ధర క్వింటా రూ.150 పలుకుతోంది. ఇది గత ఏడాదికంటే తక్కువ కావడం గమనార్హం. తమిళనాడులోని తూతుకూడిలో క్వింటా ఉప్పు రూ.350 పలుకుతుండగా జిల్లాలో మాత్రం అందులో సగమే దక్కుతుండటంతో రైతులు నిశ్చేష్టులవుతున్నారు. గతంలో పాత ఉప్పు ధర అధికంగా, కొత్తగా ఉత్పత్తి చేసిన ఉప్పు అంతకంటే కాస్త తక్కువ ధర పలికేది. కానీ దళారుల మాయాజాలంతో పాత ఉప్పు ధర 75 కేజీల బస్తాపై రూ.50 తగ్గింది. కేజీ ఉప్పు ధర మరో రూ.3 పెరిగితే కనీసం పెట్టుబడి చేతికొస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

ఆ కయ్యా మాదే.. ఈ కయ్యా మాదే..!

మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో ఉప్పు ధర పెరిగే అవకాశం ఉన్నా లోకల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి అడ్డు తగులుతున్న తీరు చర్చనీయాంశమైంది. ఇతర జిల్లాల నుంచి వ్యాపారులను రానివ్వకుండా లోకల్ సిండికేట్ బెదిరిస్తుండటమే కాకుండా లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి ఉప్పు నిల్వ చేస్తున్నారు. రైతులకు తక్కువ ధర చెల్లించి కొనుగోలు చేసిన ఈ ఉప్పును మార్కెట్‌లో హెచ్చు ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా వ్యాపారుల సిండికేట్ పావులు కదుపుతోంది.

జిల్లాలో పరిశ్రమలు లేకనే..



మన జిల్లాలో తయారైన ఉప్పు తెలంగాణ, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక లాంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఇక్కడ నుంచి దూర ప్రాంతాలకు తరలించాలంటే లారీలకు బాడుగ ఖర్చులెక్కువ. ఆ బాడుగ భారాన్ని రైతుల పైనే వేస్తున్నారు. అందువల్ల రైతుకు వచ్చే లాభంలో కొంత బాడుగ రూపంలో నష్టపోతున్నారు. మన జిల్లాలో తోళ్ల పరిశ్రమలు, కెమికల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే ఉప్పు రైతులు బాగుపడతారు.

– యు.కోటేశ్వరావు, మోటుమాల

విద్యుత్ బిల్లుల వల్ల కొంత ఊరట



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని విద్యుత్ బిల్లుల బాధ తప్పి కొంత ఊరట లభించింది. యూనిట్ రూ.7గా ఉన్న విద్యుత్ చార్జీని వైఎస్సార్ ఒక రూపాయికి తగ్గించి ఉప్పు రైతులను ఆదుకున్నారు. సగం పెట్టుబడి కలిసిరావడంతో ఉప్పు సాగు కూడా పెరిగింది. అదే విద్యుత్ ధర ఇప్పటికీ కొనసాగుతోంది.

– పురిణి విష్ణువర్థన్‌రెడ్డి మోటుమాల

ధర పెరిగితే కూలీలకూ లాభం



ఉప్పు తయారీ భూములు సాగుబడి చేస్తే ఎనిమిది నెలలపాటు జీతమిస్తారు. మేము ఎక్కడకు పోకుండా ఇక్కడే ఉపాధి పొందుతున్నాం. నాతోపాటు వేలాది మందికి జీవనం కలుగుతోంది. ఉప్పు ధర ఎక్కువగా పలికితే రైతులు మాకు కూలి పెంచి ఇస్తారు. ధర బాగుంటే రైతులతోపాటు మేమూ బాగుంటాం.

– మల్లవరపు శ్రీను, ఉప్పు కార్మికుడు

మద్యం తాగించి కొట్టి చంపారు



అర్జున్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: మిస్టరీగా మారిన అర్జున్ రెడ్డి హత్య కేసు ఒక కొలిక్కి వచ్చింది. ఒంగోలు రూరల్ మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన మోరుబోయని అర్జున్ రెడ్డి (57) గత నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదు. దాంతో అనుమానం వచ్చిన ఆయన సోదరుడు వెంకటేశ్వర రెడ్డి 29వ తేదిన తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అర్జున్ రెడ్డి భార్య సుశీలతో వివాహేతర సంబంధం ఉన్నట్లు చెబుతున్న కాపూరి రమేష్‌రెడ్డిని గురువారం ఉదయం అరెస్టు చేశారు. తమదైన శైలిలో విచారించారు. దాంతో అర్జున్ రెడ్డిని హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసుల కథనం ప్రకారం...పాతపాడుకు చెందిన కాపూరి రమేష్‌రెడ్డికి, అదే గ్రామానికి చెందిన మోరబోయిన అర్జున్ రెడ్డి భార్య సుశీలతో అక్రమ సంబంధం ఉంది. చాలా కాలంగా వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుంది. అయినా అర్జున్‌రెడ్డి అడ్డుగా ఉన్నాడని భావించిన రమేష్‌రెడ్డి, సుశీలతో కలిసి హత్యకు పథకం పన్నాడు. ఈ పథకంలో భాగంగా అర్జున్‌రెడ్డిని మద్యం తాగేందుకు రమ్మని చెప్పి దశరాజుకుంట పొలాల వైపు పిలుచుకొని వెళ్లాడు. అర్జున్‌రెడ్డిని మాటల్లో పెట్టి ఫుల్లుగా మద్యం తాగించాడు. మద్యం మత్తులో ఉన్న అతడిని రాయితో కణతకు కొట్టి చంపాడు. అర్జున్ రెడ్డి మరణించాడని నిర్ధారణ చేసుకున్న తరువాత సుశీలతో కలిసి మృతదేహాన్ని పక్కనే ఉన్న మరల బావిలో పడేశారు. ఆ తరువాత ఏమీ తెలియనట్లు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అయితే 19వ తేదీ నుంచి అర్జున్ రెడ్డి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చింది. మృతుడి సోదరుడు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అర్జున్‌రెడ్డి భార్య సుశీల ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సీఐ అజయ్ కుమార్ తెలిపారు. ఆమె కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఆమెను పట్టుకుంటామని చెప్పారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

- బేస్తవారిపేటలోని ఓ రైస్ మిల్లులో పాలిష్ చేసి అక్రమంగా రవాణా
- లారీని సీజ్ చేసిన మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్
- కంభం రేషన్ గోడౌన్‌కు బియ్యం తరలింపు



పట్టుకున్న లారీ వద్ద సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతూనే ఉన్నారు. గురువారం బేస్తవారిపేట జంక్షన్‌లో హైవే రోడ్డు పక్కన ఉన్న రైస్ మిల్లులో పాలిష్ చేసిన రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ సీజ్ చేశారు. రైస్ మిల్లులో 300 క్వింటాళ్ల పాలిష్డ్ రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకున్న లారీ ఇక్కడి పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకుని వెళ్తుండగా సబ్ కలెక్టర్ అదుపులోకి తీసుకున్నారు. లారీలో రేషన్ బియ్యం బస్తాలను కిందకు దింపి పరిశీలించారు. తెల్లటి సంచులకు ఇంపోర్టర్ వియత్నాం అడ్రస్‌తో, ఎక్స్‌పోర్టర్ అడ్రస్ హేమరాజ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్‌కతా, వెస్ట్‌బెంగాల్ పేరుతో ట్యాగ్‌లు వేశారు. లారీని పట్టుకున్న విషయం తెలుసుకున్న యజమానులు హుటాహుటిన సబ్ కలెక్టర్ వద్దకు చేరుకున్నారు. నంద్యాలలో జనవరిలో నిర్వహించిన వేలంలో రేషన్ బియ్యం కొన్నామని, బేస్తవారిపేటలోని రైస్‌మిల్లుకు తీసుకొచ్చి పాలిష్ చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తున్నామని వ్యాపారులు చెప్పడం గమనార్హం. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్.. ఎన్ని బియ్యం కొన్నారు, ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్లు ఎక్స్‌పోర్ట్ చేశారు, స్టాక్ ఎక్కడ పెట్టారు, బ్యాగ్‌లపై అంటించిన అడ్రస్‌లకు బియ్యం పంపకుండా మరో చోటకు ఎందుకు తరలిస్తున్నారు, బియ్యం కొనుగోలు చేసి నాలుగు నెలలు అవుతున్నా ఎందుకు ఎక్స్‌పోర్ట్ చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించడంతో యాజమాని నీళ్లు నమిలాడు. నంద్యాల నుంచి లారీలో బియ్యం తెస్తే గాజులపల్లె, తాటిచర్ల మోటు వద్ద చెక్ పాయింట్లలో తీసుకున్న రశీదులు ఎక్కడ?, రేషన్ బియ్యం మిల్లుకు తరలించేటప్పుడు అధికారులకు సమాచారం ఇచ్చారా అని ప్రశ్నించగా సరైన సమాధానం లేదు. దీంతో లారీని సీజ్ చేసి కంభంలోని రేషన్ గోడౌన్‌కు తరలించాలని తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణరెడ్డిని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట ఎఫ్ఐ సల్మాన్, ఆర్ఐ కాశయ్య, వీఆర్వో ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేసింది వైఎస్ జగనే..

- ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్



మాట్లాడుతున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం: ముస్లిం మైనార్టీల మనోభావాలను గౌరవిస్తూ పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంటుందని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారన్నారు. గురువారం మార్కాపురంలో తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బిల్లును రాష్ట్రంలోని టీడీపీ జనసేన పార్టీలు సమర్థించగా, వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందన్నారు. గతంలో కూడా మైనార్టీల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ చేయూతనిచ్చిందన్నారు. ముస్లింల స్థితిగతులు మార్చేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుకు వేసిన వైఎస్ జగన్ ముస్లింలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకు నడిపారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించగా, వైఎస్సార్ సీపీ మాత్రం గౌరవించిందన్నారు. ముస్లిం సమాజం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటుందని తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి వైఎస్ జగన్ అత్యధికంగా నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో షాదీఖానాల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సైతం నిధులు కేటాయించారన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకుని, ముస్లింల మనోభావాలను గౌరవించాలని షంషేర్ ఆలీబేగ్ కోరారు.

బరితెగించిన తెలుగు తమ్ముళ్లు

- మట్టి కోసం నేతివారికుంట కట్ట ధ్వంసం
- అడ్డుకున్న గ్రామస్తులు, అధికారులు
- కట్టను వదిలి చెరువులో తవ్వకాలు



నేతివారికుంట కట్టను ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నేతివారికుంట కట్టను జేసీబీతో ధ్వంసం చేస్తున్న దృశ్యం



కుంటలో మట్టి ట్రాక్టర్ ద్వారా తరలింపు

జరుగుమల్లి(సింగరాయకొండ): అధికార అండగా తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. మట్టి కోసం ఏకంగా 48 ఎకరాల ఆయకట్టు ఉన్న నేతివారికుంట కట్టను ధ్వంసం చేశారు. జరుగుమల్లి పంచాయతీలోని పంగులూరివారిపాలెంలోని నేతివారికుంటను చింతలపాలెం గ్రామానికి చెందిన పచ్చతమ్ముళ్లు యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు కావడంతో అధికారులు సైతం ఏం చేయలేక మిన్నకుండాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..పంగులూరివారిపాలెం గ్రామ పరిధిలో ఉన్న నేతివారికుంటకు 48 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కుంటను గతంలో ఐటీసీ కంపెనీ వారు అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా కుంట కట్టలను పటిష్టం చేయడంతో పాటు అభివృద్ధి చేశారు. కానీ గురువారం చింతలపాలెం గ్రామానికి చెందిన పచ్చతమ్ముళ్లు తమ పొలాలకు మట్టి కావాలని ఎటువంటి అనుమతులు లేకుండా నేతివారికుంట కట్టలను ధ్వంసం చేసి మట్టిని తరలించారు. దీంతో విషయం తెలిసి జరుగుమల్లి గ్రామ సర్పంచ్ కె.పున్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నిక శ్రీనివాసులు గ్రామస్తులను వెంటబెట్టుకుని వెళ్లి జేసీబీనీ, ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ లోగా కుంట కట్టలను ధ్వంసం చేస్తున్నారని పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వటంతో ఆర్ఐ స్రవంతి, వీఆర్‌ఓ చైతన్య, పంచాయతీ కార్యదర్శి విద్యుల్లతలు అక్కడికి చేరుకుని అక్రమరవాణాదారులను అడ్డుకున్నారు. అయితే తమ్ముళ్లు మాత్రం వీరిని లెక్కచేయకుండా కుంట కట్టను ధ్వంసం చేస్తాం..అవసరమైతే మళ్లీ ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద కట్టను అభివృద్ధి చేస్తామని వారితో వాదులాటకు దిగారు. దీంతో అధికారులు, గ్రామస్తులు ససేమిరా అనడంతో చివరికి తమ్ముళ్లు కట్టను వదిలి కుంటలోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించారు. దీనిపై సర్పంచ్ పున్నారావు మాట్లాడుతూ తమ్ముళ్ల అక్రమ దందాపై రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అండగా ఉంటామని నిండా ముంచారు

- వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతివ్వడంపై ముస్లిం జేఏసీ ఆగ్రహం
- ముస్లింల దృష్టిలో చరిత్రహీనుడిగా చంద్రబాబు ఉండిపోతారని మండిపాటు

ఒంగోలు వన్‌టౌన్: పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు అనుకూలంగా విప్ జారీ చేసిన టీడీపీ ముస్లింల నమ్మకాన్ని వమ్ము చేసిందని ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. ముస్లింలపై చంద్రబాబునాయుడు వివక్ష పూరిత వైఖరిని ప్రదర్శించారని దుయ్యబట్టారు. గతంలో నవాబులు, ధనవంతులు ముస్లింల సంక్షేమం కోసం ధార్మిక అవసరాల కోసం దానం ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కాపాడాలని ముస్లింలు ఉద్యమిస్తే దానికి భిన్నంగా వక్ఫ్ సవరణ బిల్లును అమలులోకి తీసుకురావడం దారుణమని పేర్కొన్నారు. సవరణ కమిటీలోని 20 మందిలో కేవలం 8 మంది ముస్లింలనే నియమించడం కేంద్ర ప్రభుత్వ పన్నాగాన్ని తేటతెల్లం చేసిందని ధ్వజమెత్తారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబునాయుడు.. ముస్లింలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. చరిత్రలో ఎప్పటికీ ముస్లిం సమాజం చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రకటన చేసిన వారిలో ఐక్యవేదిక నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్, సయ్యద్ సర్దార్, ఎస్‌కె మహ్మద్ రఫీ,సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కొమరోలు: ఆరుబయట నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుండగుడి దుశ్చర్యతో ఉలిక్కిపడి లేచిన ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ ప్రయోజనం లేకపోయింది. స్థానికులు డయల్ 100కు కాల్ చేసి చోరీ విషయాన్ని తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రజలు వేసవి వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది జాగ్రతలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కాన్ఫరెన్స్ వివరాలను డీఎంహెచ్‌ఓ వెల్లడించారు. స్కూలు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, సికిల్ సెల్ అనీమియా, వేసవి వ్యాధుల గురించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పలు సూచనలు చేసినట్లు తెలిపారు. గర్భిణులను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారికి పూర్తిస్థాయి వైద్య సేవలను అందించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడే వారిని సకాలంలో గుర్తించి వైద్య అందిస్తే మాతృమరణాలు గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. 5 ఏళ్ల లోపు బరువు తక్కువగా ఉన్న చిన్నారులను న్యూట్రీషన్ రీ హాబిలేషన్ సెంటర్‌కు రెఫర్ చేయడం ద్వారా శిశు మరణాలకు అడ్డుకట్టవేయవచ్చన్నారు. వడదెబ్బ నివారించుటకు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ, శ్రవణ్, శ్రీవాణి, హేమంత్, చల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

- నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి
- ఎస్పీ ఏఆర్ దామోదర్



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

కనిగిరిరూరల్:

శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కనిగిరి డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల్లోని పోలీస్ క్వార్టర్స్, పెండింగ్ కేసుల వివరాలను, ఎస్సీ, ఎస్టీ ఫోక్సో కేసుల వివరాలను తెలుసుకుని డీఎస్పీకి పలు సూచనలు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులు, శాంతి భద్రతల అంశాలపై డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌తో క్షుణ్ణంగా చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కనిగిరిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఏమైనా సమస్యలు ఎదుర్కొంటుంటే తక్షణం నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కేసుల పరిష్కారం జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. అంజుమన్ కమిటీ సభ్యులు , గ్రానైట్ క్వారీ సభ్యులు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాను అందచేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐ ఖాజావలి, కనిగిరి, హెచ్‌ఎంపాడు ఎస్సైలు టి.శ్రీరాం, యు మాధవ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఉదయాన్నే స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, క్లబ్ సభ్యులతో కలిసి షటిల్ ఆడారు. ఆతర్వాత పట్టణంలోని సాయిబాబా గుడి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ కలిసి, పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.